W W W.EPAPER.MAHADAILY.COM

మహా పత్రిక

ఖమ్మం

భద్రాద్రి కొత్తగూడెం

10-12-2025







06

## పాత, కొత్త తేడా లేదు... అందరినీ కలుపుకుపోతాం

పాత కొత్త అనేది ఏమీ లేదు. పార్టీలో ఉన్న వారందరినీ కలుపుకు పోతాం. సమన్వయంతో పని చేస్తాం. రాబోయే కాలంలో ఖమ్మం నగరంలో కాంగ్రెస్ పార్టీని మహెూన్నత శక్తిగా తయారు చేస్తామ ని సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి పేర్కొన్నారు. ఖమ్మం ప్రెస్ క్లబ్-టీయూడబ్ల్యూజే (ఐజేయు) ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన ' మీట్ ద ప్రెస్ ' కార్యక్రమంలో దీపక్ చౌదరి పలువురు జర్నలిస్టులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు.



02

### ముగిసిన నామినేషన్ల పరిశీలన


మూడవ విడత స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల పరిశీలన సింగరేణి మండలంలో మంగళవారం ముగిసాయి. మండలంలో 41 గ్రామ పంచాయతీలకు ఈ నెల 17వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి.



02

### తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

కలెక్టరేట్ ఆవరణంలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మంగళవారం నాడు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. పద్మశ్రీ, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో కె. శ్రీనివాసరావు, వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




ఖమ్మం బ్యూరో, మహా

## తొలి విడత పోరుకు

# సర్వం సిద్ధం

- పంచాయతీ ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రత
- రేపే పోలింగ్ , కౌంటింగ్
- బరిలో 488 మంది సర్పంచ్ అభ్యర్థులు..
- లక్షా 24 వేల మందికి పైగా మహిళా ఓటర్లు
- సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక నిఘా..
- ఎన్నికల నిర్వహణకు భారీ ఏర్పాట్లు
- 2,41,137 మంది ఓటర్ల తీర్పు.

09

ఖమ్మం జిల్లాలో ప్రతిష్టాత్మకంగా జరగనున్న పంచాయతీ ఎన్నికల మొదటి విడత నిర్వహణకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. జిల్లాలోని ఏడు మండలాల పరిధిలో డిసెంబర్ 11న జరగనున్న పోలింగ్ ప్రక్రియ కోసం పటిష్టమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలను జిల్లా యంత్రాంగం చేపట్టింది. ఈ మొదటి విడతలో మొత్తం 192 గ్రామ పంచాయతీలకు గాను 20 పంచాయతీలు ఏకగ్రీవం కాగా, మిగిలిన 172 గ్రామ పంచాయతీల సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ స్థానాల కోసం మొత్తం 488 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు.

### 3424 మంది అభ్యర్థులు పోటీ

1740 వార్డులకు సంబంధించి 2 వార్డులలో నామినేషన్లు దాఖలు కాలేదని, 323 వార్డులు ఏకగ్రీవం అయ్యాయని కలెక్టర్ తెలిపారు. మిగిలిన 1415 వార్డుల కోసం 3424 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ రోజునే ఫలితాలు కూడా వెల్లడికానున్నాయి. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరుగుతుందని, అనం తరం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టి ఫలితాలు ప్రకటిస్తామని అధికారులు స్పష్టం చేశారు.





# తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ఖమ్మం, మహా:** కలెక్టరేట్ ఆవరణంలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మంగళవారం నాడు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. పద్మశ్రీ, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో కె. శ్రీనివాసరావు, వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## వినాయకపురం గ్రామంలో జోరందుకున్న ఎన్నికల ప్రచారం



**అశ్వారావుపేట, మహా:** అశ్వారావుపేట మండలం వ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారం వేడెక్కుతోంది. ప్రతి గ్రామంలో ఎన్నికల చర్చలు హోరెత్తుతుండగా, వినాయకపురం గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ప్రచారంలో దూకుడు ప్రదర్శిస్తున్నారు. వినాయకపురం గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవికి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న కొవ్వాసి రాజు కత్తెర గుర్తు పై గెలుపుకోసం విస్తృత ప్రచారం కొనసాగిస్తున్నారు. పార్టీ తమపై నమ్మకం ఉంచి అవకాశం ఇవ్వడం ఆనందంగా ఉందని, గ్రామ అభివృద్ధికే ప్రథమ ప్రాధాన్యం ఇస్తానని తెలిపారు. గ్రామంలో ప్రధాన సమస్యలైన తాగునీటి సమస్య పూర్తి నిర్మూలన, సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాల ఏర్పాటు వంటి ప్రజా సౌకర్యాల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్ల పథకం అందేలా చర్యలు తీసుకుంటామని, పంచాయతీలో తాటాకు ఇల్లు లేకుండా చేయడం తమ ముఖ్య లక్ష్యం అని స్పష్టం చేశారు. రాష్ట్రం, నియోజకవర్గం కాంగ్రెస్ పాలనలోనే ఉన్నందున పంచాయతీ కూడా కాంగ్రెస్ చేతుల్లోకి వస్తే అభివృద్ధి మరింత వేగం అందుకుంటుందనే అభిప్రాయం వ్యక్తం చేశారు. వినాయకపురం అభివృద్ధి కోరుకునే ప్రతి ఓటరు కత్తెర గుర్తుకు ఓటేయించి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు.1వ వార్డులో కాంగ్రెస్ తరపున పోటీ చేస్తున్న నల్లపు వీర వెంకట సత్యనారాయణ స్టూలు గుర్తుకు ఓటేయాలని ఓటర్లను కోరారు. సర్పంచ్ అభ్యర్థితో కలిసి మిగతా వార్డు సభ్యులు కూడా గెలిస్తే పంచాయతీ మొత్తం అభివృద్ధి దిశగా పయనిస్తుందని తెలిపారు. తమకు పదవి కాదు, గెలిచి ఊరు అభివృద్ధి చేయడం మాత్రమే లక్ష్యం అని వినాయకపురం కాంగ్రెస్ బృందం స్పష్టం చేసింది. గ్రామ ప్రజల ఆశలు నెరవేర్చే పాలన అందిస్తామని, ప్రజల తీర్పును విశ్వసిస్తున్నామని అభ్యర్థులు పేర్కొన్నారు.

## మూడు చక్రాల సైకిల్ వితరణ చేసిన లయన్స్ క్లబ్

**దమ్మపేట, మహా :** స్థానిక పట్టణ కేంద్రంలో లయన్స్ క్లబ్ దమ్మపేట వారి ఆధ్వర్యంలో వికలాంగురాలికి మంగళవారం మూడుచక్రాల సైకిల్ ను అందించారు. టిటిడి కళ్యాణ మండపం సమీపంలో ఉన్న మాదాల అర్జునరావు కుమార్తె ,గంగాభవాని కి కాళ్ళు లేక నడవలేక పోతుండటంతో ,తన స్వంత పనులు చేసుకోవడానికి కూడా కుటుంబ సభ్యులపై ఆధారపడి ఉంటుందని తెలుసుకున్న లయన్స్ సభ్యులు స్పందించారు. లయన్స్ క్లబ్ దమ్మపేట మండల అధ్యక్షులు అంకత మహేశ్వరరావుకి లయన్స్ సభ్యులు ఈ విషయం తెలపడంతో జిల్లా చైర్మన్ దారా యుగంధర్ అధ్యక్షతన ట్రై సైకిల్ అందించారు. ఈ సందర్భంగా జిల్లా చైర్మన్ దారా మాట్లాడుతూ ఈ ప్రాంతంలో నిరుపేదలకు లయన్స్ క్లబ్ సేవలు ఎల్లవేళలా అందుతాయని తెలిపారు. అధ్యక్షులు మాట్లాడుతూ ఇప్పటికే నిరుపేదలైన వృద్ధులకు ఉచిత కంటి ఆపరేషన్ లు ,క్యాంప్ లు ఏర్పాటు చేశామని , తోపుడు బండ్లు పంపిణీ,దుప్పట్లు అందజేత వంటి తదితర సేవా కార్యక్రమాలు ఎన్నో చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెక్రటరీ రాచూరి వేణుగోపాల్ , సీనియర్ సభ్యులు కక్కిరాల రమేష్ ,వెంకటేశ్వరరావు ,దారా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



## గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ యాక్ట్ అమలు



**ఖమ్మం, మహా:** ఈ నెల 11 న నిర్వహించనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల మొదటి విడత పోలింగ్ నేపథ్యంలో ఖమ్మం కమిషనరేట్ పరిధిలోని మొదటి విడత పోలింగ్ జరిగే కొణిజర్ల, రఘునాథపాలెం, బోనకల్లు, వైరా, చింతకాని, మధిర, ఎర్రుపాలెం మండలాల్లో సెక్షన్ 163 బి ఎన్ ఎస్ ఎస్ యాక్ట్ అమలులో ఉంటుందని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మంగళవారం తెలిపారు. మంగళవారం సాయంత్రం 5:00 గంటల నుండి గురువారం పోలింగ్, ఓట్ల లెక్కింపు, ఫలితాలు ప్రకటించే వరకు ఆంక్షలు అమలులో వుంటాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలు ఐదుగురు కంటే ఎక్కువ మంది గుంపులుగా ఉండరాదని పోలీస్ కమిషనర్ అన్నారు. ఎవరూ రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయడం, కవ్వింపు చర్యలకు పాల్పడటం చేయరాదని సూచించారు. ఎవరైనా ఎన్నికల నియమాలను ఉల్లంఘించినా/అతిక్రమించినా, చట్ట వ్యతిరేకంగా ప్రవర్తించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ప్రతి అభ్యర్థి బాధ్యతగా వ్యవహరించాలి: పోలీస్ కమిషనర్



**ఖమ్మం, మహా:** గ్రామ పంచాయతీ ఎన్నికలను శాంతియుత వాతావరణంలో జరిగేందుకు ప్రతి అభ్యర్థి బాధ్యతగా వ్యవహరించాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పిలుపునిచ్చారు. ఖమ్మం రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో రూరల్ మండలం ఎన్నికలలో సర్పంచ్ గా నామినేషన్ వేసిన అభ్యర్థులకు అవగాహన కార్యక్రమాన్ని రామ్ లీలా ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఎన్నికలు చాలా కీలకమని, వ్యక్తిగత దూషణలకు వెళ్లకుండా అందరూ సమన్వయం పాటించాలని అన్నారు.గ్రామాల్లో ఏదైనా ఘర్షణ వాతావరణం ఉంటే పోలీసులు సమాచారం ఇవ్వాలని సూచించారు. అభ్యర్థులు ఎన్నికల నిబంధనలు గౌరవించి పోలీసులకు సహకరిస్తే ఎన్నికలు మరింత ప్రశాంతంగా కొనసాగుతాయని అన్నారు. ఓటర్లను ఎలాంటి ప్రలోభాలకు గురిచేయవద్దని విజ్ఞప్తి చేశారు. నియమ నిబంధనలు పాటించకపోతే కేసులు సైతం నమోదు అవుతాయని తెలిపారు. ఎక్కడ కూడా శాంతిభద్రతల సమస్య రాకుండా పోలీసులు సూచనలు పాటించాలని అన్నారు. ముఖ్యంగా సెక్షన్ 163 బి ఎన్ ఎస్ ఎస్ యాక్ట్ అమల్లో ఉన్న నేపథ్యంలో ఎన్నికలు, ఫలితాల అనంతరం ఎలాంటి ర్యాలీలు గాని సమావేశాలకు గాని అనుమతి లేదని, ఇది గమనించి అందరూ సహకరించాలని అన్నారు. కార్యక్రమంలో ట్రైని డిప్యూటీ కలెక్టర్ ఎం . అపూర్వ, ఏఆర్ అడిషనల్ డీసీపీ విజయబాబు, ఏసీపీ తిరుపతి రెడ్డి, ఏ ఆర్ ఏసీపీ నర్సయ్య, ఎం ఆర్వో రామ్ ప్రసాద్, ఎంపిడివో రవికుమార్, శ్రీనివాస్ రావు, సిఐ రాజు, తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.

## పంచాయతీ ఎన్నికల సామాగ్రి పంపిణీ పకడ్బందీగా చేపట్టాలి



**ఖమ్మం, మహా:** పంచాయతీ ఎన్నికలను పూర్తిస్థాయిలో నిష్పక్షపాతంగా నిర్వహించాలని, ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ ప్రక్రియకు అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. డిసెంబర్ 11న మొదటి విడతలో నిర్వహించే గ్రామ పంచాయతీల ఎన్నికల సందర్భంగా చింతకాని, బోనకల్ మండలాలలో జిల్లా కలెక్టర్ మంగళవారం పర్యటించి, ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాల ఏర్పాట్లను తనిఖీ చేశారు.

## అశ్వారావుపేట అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో తనిఖీలు ముమ్మరం



**అశ్వారావుపేట, మహా :** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అశ్వారావుపేట అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో పోలీసులు నాకాబందీ ఏర్పాటు చేసి వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. ఎన్నికల సమయంలో నిబంధనలకు విరుద్ధంగా నగదు, మద్యం లేదా ఇతర అక్రమ వస్తువుల రవాణా జరగకుండా ఉండేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. సీఐ నాగరాజు ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ తనిఖీల్లో అనుమానాస్పద వాహనాలు, వ్యక్తులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కఠిన భద్రతా చర్యలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో పోలీసులు అప్రమత్తంగా ఉండి నిరంతర నిఘా కొనసాగిస్తున్నారు.

## రంగంబంజర గ్రామపంచాయతీ ఏకగ్రీవం



**తల్లాడ, మహా:** తల్లాడ మండలంలోని రంగం బంజర గ్రామపంచాయతీ సర్పంచ్ ఏకగ్రీవమైంది. కాంగ్రెస్ పార్టీ, బీఆర్ఎస్ పార్టీల నాయకులు సమన్వయంతో మాట్లాడుకొని ఓ నిర్ణయానికి వచ్చి ఏకగ్రీవం చేసుకున్నారు. కాంగ్రెస్ సర్పంచిగా దేవరపల్లి శ్రీనివాసరావుకు, బీఆర్ఎస్ పార్టీకి ఉపసర్పంచ్ గా బొల్లిగర్ల కృష్ణ పదవిని ఏకగ్రీవం చేసుకున్నారు. అదేవిధంగా గ్రామంలో ఎనిమిది వార్డులు ఉండటంతో కాంగ్రెస్ పార్టీకి నాలుగు, బిఆర్ఎస్ పార్టీకి నాలుగు వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలనే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ, బీఆర్ఎస్ పార్టీల నాయకులు సమన్వయంతో వ్యవహరించి ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. ఏకగ్రీవం అయితే గ్రామాభివృద్ధికి ప్రభుత్వం నుండి నిధులు వచ్చే అవకాశం ఉండటంతో వాటిని సద్వినియోగం చేసుకునేందుకు ఇరు పార్టీల నాయకులు మాట్లాడుకుని ఒప్పందానికి వచ్చి ఏకగ్రీవం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీలో చేరిన భూపాలపట్నం మాజీ సర్పంచ్



**పినపాక,మహా:** స్థానిక సంస్థల ఎన్నికలు రెండు రోజుల్లో ఉన్న నేపథ్యంలో హస్తం పార్టీకి పెద్ద షాక్ తగిలింది. మంగళవారం పినపాక మండలం భూపాలపట్నం గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ కొరసా కృష్ణంరాజు, ఆయనతోపాటు 20 కుటుంబాల సభ్యులు మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు సమక్షంలో బీఆర్ఎస్ లో చేరగా ,వారికి ఆయన బీ ఆర్ ఎస్ పార్టీ కండువాలు కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు.ఆ పార్టీ మండల నాయకులు దొడ్డ శ్రీనివాస్ రెడ్డిని మాజీ ఎమ్మెల్యే రేగా ప్రత్యేకంగా అభినందించారు. భూపాలపట్నంలో బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తామని ఈ సందర్భంగా వారు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బీ ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పగడాల సతీష్ రెడ్డి,ప్రశాంత్ ,మాజీ సర్పంచ్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.


## ఒక్క ఛాన్స్ ఇవ్వండి



**తల్లాడ, మహా:** మండలంలో గోపాల పేట గ్రామ కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే మట్టా రాగమయి దయతోనే రాజకీయంగా అడుగులు వేశానని. స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి. తెలంగాణ రాష్ట్ర నాయకులు మట్ట దయానంద్, ఆశీస్సులతోనే . గోపాల్ పేట కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని కాంగ్రెస్ అభ్యర్థి తాళ్ల సుధారాణి అన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిఆర్ఎస్ కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థిగా పోటీలో ఉన్నానని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడక రెండేళ్ల కాలంలోనే ఎమ్మెల్యే మట్ట రాగమయి, సహకారంతో గ్రామంలో సుమారు పది లక్షల గ్రాంటును తీసుకువచ్చి గ్రామ అభివృద్ధికి కృషి చేశామని . 70 లక్షల గ్రాంటు తీసుకొచ్చి సుమారు గ్రామంలో అన్ని సిసి రోడ్డులుగా మార్చాము గ్రామానికి ఇందిరమ్మ ఇండ్లు పది తీసుకొచ్చాము ఇలా ఎన్నో కార్యక్రమాలు చేశారని. గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆర్ గ్యారంటీల పథకాలు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి, మహాలక్ష్మి ,ఇందిరమ్మ చీర ల పంపిణీ లబ్ధిదారులకు అందాయని తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు , తదితరులు హాజరయ్యారు.

## ధాన్యం కేటాయింపుకు బ్యాంక్ గ్యారంటీ తప్పనిసరి

**ఖమ్మం,మహా:** జిల్లాలోని రైస్ మిల్లర్లకు వరి ధాన్యం కేటాయింపు చేసేందుకు బ్యాంకు గ్యారంటీ లేదా సెక్యూరిటీ డిపాజిట్ చూపించడం తప్పనిసరి అని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో రైస్ మిల్లర్ల తో ధాన్యం కేటాయింపు, బ్యాంక్ గ్యారంటీ, పెండింగ్ సిఎంఆర్ రైస్ డెలివరీపై అదనపు కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మిల్లులకు సరఫరా చేసే ధాన్యానికి బ్యాంకు గ్యారంటీ, సెక్యూరిటీ డిపాజిట్ తప్పనిసరి అని అన్నారు. రైస్ మిల్లులు అందజేసిన బ్యాంకు గ్యారంటీ ఆధారంగా కేటాయింపులు చేయడం జరుగుతుందని తెలిపారు. యాసంగి 2024-25 పంటకు సంబంధించి డిసెంబర్ 8 వరకు జిల్లాలో పెండింగ్ ఉన్న 12 శాతం సీఎంఆర్ రైస్ డెలివరీ పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.



# ఊరంతా ఒక్కటయ్యారు

- యూత్ చొరవతో జీపీ ఏకగ్రీవం...
- సీఎం పీఆర్వో విజయ్ స్వగ్రామంలో వెల్లివిరిసిన ఆదర్శం
- ఐక్యతను చాటిన కమలాపురం

**కారేపల్లి, మహా:** రాజకీయ ఘర్షణలతో నాడు కత్తులు దూసిన కొత్త కమలాపురం గ్రామం యువత చూపిన చొరవతో ఐక్యతను చాటి గ్రామపంచాయతీని ఏకగ్రీవం చేసుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి పీఆర్వో దూదిపాళ్ళ విజయ్ కుమార్ స్వగ్రామమైన కొత్త కమలాపురం లో జీపీ ఏకగ్రీవం కావడంతో వెల్లివిరిసిన ఆదర్శంతో గ్రామస్తులు సంబరాలు జరుపుకుంటున్నారు.. రాజకీయ కక్షలు భిన్నాభిప్రాయాలు కలిగిన నాయకులు ఉన్న ఈ గ్రామంలో గతంలో ప్రతి ఎన్నిక వివాదాస్పదంగానే ఉండేది. రెండేళ్ల కింద జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఈ గ్రామానికి చెందిన ఓ యువకుడు హైదరాబాదులో ఉంటూ ఓటు హక్కు వినియోగించుకోవడానికి స్వగ్రామం రాగా ఆ యువకుడు పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేసేందుకు పోలీసు బందోబస్తు తో వెళ్లాల్సి వచ్చింది. ఈ పరిస్థితిలో ఉన్న కొత్త కమలాపురంలో ఈ రెండేళ్లలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. దీనికి ప్రధాన కారణం కమలాపురం గ్రామానికి చెందిన దూదిపాళ్ల విజయకుమార్ సీఎం రేవంత్ రెడ్డికి పీఆర్వో గా నియమితులు కావడం ఆయన సూచనలతో గ్రామంలోని యువత గ్రామాభివృద్ధికి బాటలు వేయాలని సంకల్పించడం ప్రధాన కారణం.





### ఎన్ఆర్ఐ లు ఆదర్శంగా నిలిచారు..

ఊరు ఊరంతా ఒక్కతాటి మీదికి రావడానికి సీఎం పిఆర్ఓ విజయ్ సూచనలతో గ్రామానికి చెందిన ఎన్నారై రేపాల సతీష్ నేతృత్వంలో ఓ యువ బృందం కీలకంగా వ్యవహరించారు. ఈ చిన్న గ్రామం నుంచి చదువుకున్న యువత విదేశాలకు వెళ్లేందుకు ఎక్కువమందికి చేయూతనిచ్చి, గ్రామంలో అనేక మందికి సహకరించిన రేపాల సతీష్ ఆలోచనలు, ఆశయాలు అన్నింటా ఆదర్శమే. ఈ యువనేత నాయకత్వంలోనే వుయ్ కేర్ అనే స్వచ్ఛంద సంస్థను ఏర్పాటుచేసి ఈ సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి ఆదర్శంగా నిలుస్తూ అదే బాటలో గ్రామాన్ని ఒక్క తాటి మీదికి తెచ్చి ఏకగ్రీవం చేయడంలో సఫలీకృతమయ్యారు. గ్రామాల్లో ఏకగ్రీవాలు అనగానే గుడి, బడి, రోడ్డు తదితర నిర్మాణాల కోసం వేలం పాటలు పెట్టడం, లేదా గ్రామస్తుల కూర్చొని ఒప్పందం చేయడం ఇన్ని డబ్బులు ఇవ్వాలి అని కండిషన్ల పెడుతూ ఏకగ్రీవాలు కావడం ఎక్కువగా చూస్తున్నాం. కానీ కొత్త కమలాపురం గ్రామపంచాయతీలో మాత్రం ఎటువంటి కండిషన్ స లేకుండా అందరి ఏకాభిప్రాయంతో ఏకగ్రీవంగా చేసుకున్నారు. దీంట్లో గ్రామంలోని యువత కీలక పాత్ర పోషించటం హర్షనీయం. ఆదర్శంగా నిలిచిన ఈ గ్రామం ఇక్కడ యువత అందరి మన్ననలు కూడా పొందుతోంది.

### సర్పంచిగా వడ్డే సులోచన, ఉప సర్పంచ్ గా దూదిపాళ్ళ భాస్కరరావు..

కొత్త కమలాపురం గ్రామపంచాయతీ సర్పంచ్ గా వడ్డే సులోచన, ఉప సర్పంచిగా దూదిపాళ్ల భాస్కర్ రావును గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిపిలో 8 వార్డులు ఉండగా ఐదు వార్డులకు కూడా వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మరో మూడు వార్డులు ఎస్టీలకు రిజర్వ్ చేయగా ఆ వార్డుల్లో ఎస్టీ అభ్యర్థులు లేకపోవడంతో అక్కడ గతంలో కూడా ఎన్నిక జరగలేదు, ఈసారి కూడా ఎన్నికలు లేవు.

### దూదిపాళ్ళ భాస్కరరావుకు దక్కిన గౌరవం...

నందమూరి తారక రామారావుకు వీరాభిమానిగా నాలుగు దశాబ్దాలుగా తెలుగుదేశం పార్టీ లీడర్ గా నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఉన్న లీడర్ గా పేరున్న దూదిపాళ్ళ భాస్కరరావు ను కమలాపురం ఉప సర్పంచ్ గా ఏకగ్రీవంగా ఎన్నుకొని గ్రామం గౌరవాన్ని కట్టబెట్టింది. నిబద్ధత గల నాయకునికి గౌరవం కల్పించడం పట్ల మండలంలోని రాజకీయ నాయకులంతా హర్షం వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ వార్డు సభ్యులు గా గుత్తా గంగయ్య, అన్నా ప్రగడ శాంతకుమారి, చాగంటి వాణిశ్రీ, బండి జ్యోతి లను గ్రామస్తులు ఏకాభిప్రాయంతో ఏకగ్రీవంగా ఎన్నుకుని ఆదర్శంగా నిలిచారు.

## పోలింగ్ సిబ్బంది మూడవ దశ ర్యాండమైజేషన్ పూర్తి

**ఖమ్మం,మహా:** జిల్లాలో జరిగే మొదటి దశ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పోలింగ్ సిబ్బంది మూడవ దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు సాధారణ ఎన్నికల పరిశీలకులు ఖర్తడే కాళీచరణ్ సుదామా రావు తెలిపారు.కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో సాధారణ ఎన్నికల పరిశీలకులు, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తో కలిసి ఆన్లైన్ ద్వారా పోలింగ్ సిబ్బంది మూడవ దశ ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు. సాధారణ ఎన్నికల పరిశీలకులు ఖర్తడే కాళీచరణ్ సుదామా రావు మాట్లాడుతూ జిల్లాలో మొదటి దశ పంచాయతీ ఎన్నికలు నిర్వహించు 192 గ్రామ పంచాయతీలకు, 1740 వార్డులకు 1582 బృందాలను ఏర్పాటు చేసి, అత్యవసర పరిస్థితుల్లో వినియోగించుకునేందుకు 20 శాతం సిబ్బందిని రిజర్వ్ లో ఉంచడం జరిగిందని తెలిపారు. 1899 పోలింగ్ అధికారులు, 2321 ఓపిఓ లను ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారా మండలాల వారీగా పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బందిని కేటాయించడం జరిగిందని తెలిపారు.



# ఖమ్మం గడ్డపై కాషాయ జెండా ఎగరడం ఖాయం

- అధికారం మాదే.. అడ్డుకునే దమ్ము ఎవరికీ లేదు
- బూత్ స్థాయి నుండే అసలైన యుద్ధం మొదలైంది!
- 'సశక్త మండల్ - సక్రియ బూత్' నినాదంతో బిజెపి సమరభేరి
- మంత్రుల గుండాయిజం, భూకబ్జాలపై ఇక సహించేది లేదు
- ప్రజా సమస్యలే అస్త్రాలుగా ప్రతినెలా ఉద్యమమే!
- బిజెపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చంద్రశేఖర్ తివారీ







**ఖమ్మం, మహా:** తెలంగాణ రాష్ట్రంలో రాబోయేది నూటికి నూరు శాతం భారతీయ జనతా పార్టీ ప్రభుత్వమేనని, ఈ చారిత్రక మార్పును ఎవరూ అడ్డుకోలేరని బిజేపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చంద్రశేఖర్ తివారీ అన్నారు. ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం మినర్వా గ్రాండ్ లో బిజెపి ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాయకులకు దిశా నిర్దేశం చేశారు. కేవలం ఎన్నికల సమయంలోనే కాకుండా, నిరంతరం ప్రజల పక్షాన నిలబడి పోరాడాలని, బూత్ స్థాయి నుండే పార్టీకి ఒక పటిష్టమైన సైన్యాన్ని నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న కుటుంబ పాలన, అవినీతి రాజకీయాలపై దృష్టి పెట్టాలని అన్నారు.గత పదేళ్లుగా బిఆర్ఎస్ పార్టీ రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోచుకుందని, ఆ అవినీతి సొమ్ముతోనే ఆ కుటుంబం బతికిందని విమర్శించారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కూడా బిఆర్ఎస్ అడుగుజాడల్లోనే నడుస్తూ అవినీతికి కొత్త నిర్వచనం చెబుతోందని చెప్పారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ కనుమరుగవుతోందని, ఈశాన్య రాష్ట్రాలైన త్రిపుర, నాగాలాండ్, మిజోరాం నుండి మొదలుకొని గుజరాత్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ వరకు కాంగ్రెస్ పార్టీ తుడిచిపెట్టుకుపోయిందని గుర్తుచేశారు. కేవలం మూడు రాష్ట్రాల్లో తప్ప దేశంలో ఎక్కడా వారికి ఉనికి లేదని, తెలంగాణలో కూడా ఆ పార్టీకి అదే గతి పడుతుందని జోస్యం చెప్పారు. ఆ రెండు పార్టీలు కేవలం తమ కుటుంబాల ఆస్తులను పెంచుకోవడానికే పనిచేస్తాయని, కానీ భారతీయ జనతా పార్టీ మాత్రం దేశం కోసం, ధర్మం కోసం పనిచేసే కార్యకర్తల పార్టీ అని, మనది క్యాడర్ బేస్డ్ పార్టీ అని వ్యత్యాసాన్ని స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లాలో అధికార పార్టీ మంత్రుల అహంకారం తారస్థాయికి చేరిందని నెల్లూరి ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో భూకబ్జాలు, సెటిల్మెంట్లు, గుండాయిజం విచ్చలవిడిగా పెరిగిపోయాయని ధ్వజమెత్తారు. ముఖ్యంగా ఒక మహిళ పట్ల, మన ఆడబిడ్డ పట్ల ఒక మంత్రి వ్యవహరించిన తీరు అత్యంత హేయమని, ఇటువంటి చర్యలను బిజెపి ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు మౌనంగా ఉండవద్దని, బాధితులకు అండగా నిలవాలని కార్యకర్తలకు సూచించారు. 'ప్రభుత్వం ఉంటే పథకాలు.. లేదంటే ఉద్యమాలు' అనే నినాదంతో ముందుకు సాగాలన్నారు. రోడ్డు బాలేకపో మౌలిక వసతులు లేకపోయినా, మరే సమస్య వచ్చినా స్థానిక నాయకత్వం తక్షణమే స్పందించాలని ఆదేశించారు. ప్రతి నెలా చివరి వారంలో ప్రజా సమస్యలపై ఏదో ఒక ఆందోళన కార్యక్రమం, ధర్నా నిర్వహించి ప్రభుత్వం మెడలు వంచాలని పిలుపునిచ్చారు. ఇక పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడానికి 'సశక్త మండల్' అనే లక్ష్యంతో ఐదు సూత్రాలను అమలు చేయాలని ఆయన సూచించారు. మొదటిది మండలంలో పార్టీ నిర్మాణాన్ని వంద శాతం పూర్తి చేయడం, రెండవది కార్యకర్తలకు పనుల విభజన చేసి క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించడం, మూడవది మండల స్థాయిలో పార్టీకి ఒక కార్యాలయ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవడం, నాలుగవది ఎన్నికల విజయానికి బూత్ ల వారీగా వ్యూహాన్ని రచించడం, ఐదవది ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాలు చేయడం. ఈ ఐదు అంశాలపై దృష్టి సారిస్తే పార్టీని అజేయ శక్తిగా తీర్చిదిద్దవచ్చని తెలిపారు.పాల్గొన్న బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ గౌతమ్ రావు మాట్లాడుతూ ఎన్నికల్లో విజయం సాధించాలంటే 'బూత్ జీతో - ఎలక్షన్ జీతో' (బూత్ గెలుపు - ఎన్నికల గెలుపు) అనే సూత్రాన్ని పాటించాలని నొక్కి చెప్పారు.

## మహాబలం - బాధ్యత మనందరిది

**చివరగా, కార్యకర్తల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపుతూ ఆయన ఉద్వేగభరితంగా మాట్లాడారు. మనలో మనం గొడవలు పడకుండా, ఒకరిపై ఒకరు నిందలు వేసుకోకుండా, పరస్పర సహకారంతో ముందుకు సాగాలని హితవు పలికారు. వచ్చే జెడ్పీటిసి, ఎంపిటిసి ఎన్నికల్లో అత్యధిక సీట్లు గెలవడమే లక్ష్యంగా, ఖమ్మం జిల్లాలో బిజెపి జెండాను రెపరెపలాడించే దిశగా ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బిజెపి ఖమ్మం జిల్లా ఇన్చార్జి బద్దం మహిపాల్ రెడ్డి , దేవకీ వాసుదేవరావు, సన్నీ ఉదయ ప్రతాప్, నాయుడు రాఘవరావు, నల్లగట్టు ప్రవీణ్ కుమార్,దొంగల సత్యనారాయణ, నెల్లూరి బెనర్జీ,తాండ్ర వినోద్ రావు, కె శ్రీధర్ రెడ్డి, గల్లా సత్యనారాయణ, నున్నా రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.**

## ఘనంగా సోనియా జన్మదిన వేడుకలు



**నేలకొండపల్లి, మహా:** ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ జన్మదిన వేడుకలు 'మంగళవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మేజర్ పంచాయతీ అభ్యర్థి పసుపులేటి శ్రీలత కేక్ కట్ చేసి వేడుకలు ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర కలలను సాకారం చేసిన మహనీయురాలని అన్నారు. ప్రధాని పదవిని తృణప్రాయంగా పక్కన పెట్టిన సోనియా గాంధీ నాయకత్వంలో పని చేయటం అదృష్టం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మండల ఇంచార్జీ రామమూర్తి, మాజీ సర్పంచ్ లు రాయపూడి నవీన్, వెంకన్న, బొందయ్య, నాగేశ్వరరావు, మైశా శంకర్, జెర్రిపోతుల అంజిని, కొమ్మూరి నరేష్, గుండా బ్రహ్మం. వాకా శ్రీనాధ్, రాంబాబు, కడియాల నరేష్, సీతారావమ్మ, జీ.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## మిర్చి తోటలోనూ ప్రచారం.... బొట్టు పెట్టి ఓట్లు అభ్యర్థిస్తూ



**నేలకొండపల్లి, మహా:** మండలంలోని కోరట్లగూడెం కాంగ్రెస్ అభ్యర్థి కొత్తపల్లి త్రివేణి విన్నూత తరహాలో ప్రచారం చేస్తున్నారు. మంగళవారం ఇండ్ల వద్ద కాకుండా కూలీలు, రైతులు అంతా వ్యవసాయ క్షేత్రాలలో ఉండటంతో అక్కడికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. మిర్చి తోటలతో మహిళ కూలీలు, రైతులు వద్ద కు వెళ్లి బొట్టు పెట్టి ఓటు అడిగారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు... నన్ను ఆశ్వీరదిస్తే మీ కష్టాలలో పాలు పంచుకుంటానని పేర్కొన్నారు. గ్రామాన్ని దశల వారీగా అభివృద్ధి చేసేందుకు సహకరించాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ సేవాదల్ పాలేరు నియోజకవర్గ కన్వీనర్ బచ్చలకూరి నాగరాజు, నాయకులు మార్తి కోటి, శంబయ్య, సుబ్బయ్య, మైబు, పాషా, చిన్న మైసయ్య, గాదె నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిపై నమ్మకం ఉంచి.. వ్యక్తిత్వాన్ని గమనించి గెలిపించండి



**తల్లాడ, మహా:** తల్లాడ: ఒక్కసారి అవకాశం ఇచ్చి సర్పంచ్ గా గెలిపిస్తే తల్లాడ మేజర్ పంచాయతీని అన్ని విధాల అభివృద్ధి చేసి చూపిస్తానని టీడీపి, మద్దతు తెలిపిన బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి పెరిక నాగేశ్వరరావు (చిన్నబ్బాయి) అంటూ ప్రచారంలో దూసుకుపోతున్నారు. మంగళవారం తల్లాడ, ఎన్టీఆర్ కాలనీలో దాదాపు 150 మందికి పైగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలతో కలిసి ప్రచారం చేశారు. తల్లాడ లో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలు, డ్రైనేజీ, కోతులు, కుక్కలు బెడద వంటి సమస్యలు పరిష్కరించి తల్లాడ మేజర్ పంచాయతీకి గుర్తింపు తెచ్చే విధంగా కృషి చేస్తానని హామీ ఇస్తూ తనకు ఓటు వేసి గెలిపించాలని వేడుకున్నారు. తల్లాడ మేజర్ పంచాయతీ రిజర్వేషన్ జనరల్ అయినా బీసీ వర్గానికి చెందిన తనకి ఇవ్వాలని బీఆర్ఎస్ పార్టీ నిర్ణయించిందని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య సహకారం, టీడీపీ, బలపరిచిన బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థిగా మీ ముందుకు వచ్చానని అభివృద్ధి పై నమ్మకం ఉంచి, వ్యక్తిత్వాన్ని గమనించి తనని సర్పంచ్ గా గెలిపించి ఆశీర్వదించాలని కోరారు. ప్రచారంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రెడ్డెం వీర మోహన్ రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసరాజు, బీఆర్ఎస్ నాయకులు దగ్గుల శ్రీనివాసరెడ్డి, జి.వి.ఆర్, గుంటుపల్లి వెంకటయ్యా, మాజీ ఉపసర్పంచ్ గుండ్ల వెంకటి కస్తూరి రాజు టిడిపి, బీఆర్ఎస్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బ్యాలెట్ ఓటేసిన ప్రభుత్వ ఉద్యోగులు



**చర్ల, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల కేంద్రంలో గల ఎంపీడీవో కార్యాలయంలో ప్రభుత్వ ఉద్యోగులు మొదటి విడత సర్పంచ్ మరియు వార్డ్ మెంబర్ ఎన్నికలకు బ్యాలెట్ ఓటు హక్కును వినియోగించుకుని తమ ఆర్డర్ కాపీ తో తమకు కేటాయించిన ప్రాంతాలకు ఎన్నికల విధులు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు, విధులు నిర్వహించేందుకు ఒకరోజు ముందుగానే తమకు జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం వారి వారి కేంద్రాలలోని ఎంపీడీవో కార్యాలయాలకు వెళ్లి శిక్షణ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఉదయం తొమ్మిది గంటల్లోగా చేరుకోవాలని డ్యూటీలు కేటాయించిన ఉద్యోగులకు ఉత్తర్వులు రావడంతో తొలి విడత బ్యాలెట్ ఓటు వేసి తమ ఓటు హక్కును మండలంలోని ప్రభుత్వ ఉద్యోగులు వినియోగించుకున్నారు. అయితే ఈ సర్పంచ్ ఎన్నికలకు ప్రభుత్వ ఉద్యోగులే కాక ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు కళాశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులకు ఎన్నికల విధులు నిర్వహించేందుకు ప్రభుత్వం ఆర్డర్ కాపీలను జారీ చేసింది.

# ఖమ్మంలో కాంగ్రెస్ గూండాగిరి


- మహిళ అని కూడా చూడకుండా చెప్పుతో కొడతారా?
- ముగ్గురు మంత్రులున్నా జిల్లాలో రౌడీ రాజ్యం
- అధికార మదంతో బిజెపి అభ్యర్థులను బెదిరిస్తే ఖబడ్దార్
- బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావు ఆగ్రహం
- పాలేరులో ప్రజాస్వామ్యానికి పాతర.. నామినేషన్ వేసిన పాపానికి చెప్పుతో దాడి చేస్తారా ?
- కన్నీటి పర్యంతమైన బాధితురాలు



**ఖమ్మం, మహా:** తెలంగాణలో ప్రజా పాలన అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం, క్షేత్రస్థాయిలో మాత్రం గూండాగిరీని ప్రోత్సహిస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. గౌతమ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం నాడు మినర్వా గ్రాండ్ హోటల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో జరుగుతున్న అరాచకాలను, అధికార పార్టీ దౌర్జన్యాలను ఎండగట్టారు. ముఖ్యంగా పాలేరు నియోజకవర్గంలో బిజెపి తరపున సర్పంచ్ గా నామినేషన్ వేసిన ఒక మహిళా అభ్యర్థి తమ్మెర రజిని రెడ్డి పట్ల కాంగ్రెస్ నాయకులు వ్యవహరించిన తీరు అత్యంత హేయమని, సభ్యసమాజం తలదించుకునేలా ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ, పరిపాలన గాలికి వదిలేసి, ప్రతిపక్షాలను అణగదొక్కడమే పనిగా పెట్టుకున్నారని గౌతమ్ రావు మండిపడ్డారు. ష్నాతర్లపాడు గ్రామంలో బిజెపి బలపరిచిన మహిళా సర్పంచ్ అభ్యర్థిని నామినేషన్ ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ గుండాలు బెదిరింపులకు గురిచేశారని తెలిపారు. నామినేషన్ విత్ డ్రా చేసుకోకపోతే ఊర్లో ఇల్లు ఉండదని, భూములు లాక్కుంటామని బెదిరించడమే కాకుండా, సదరు మహిళ అని కూడా చూడకుండా 'చెప్పుతో కొడతాం' అంటూ బూతులు తిట్టడం కాంగ్రెస్ సంస్కృతికి నిదర్శనమని ఆయన దుయ్యబట్టారు. ఆమె భర్తపై భౌతిక దాడికి పాల్పడినా, పోలీసులు బాధితులకు అండగా నిలబడాల్సింది పోయి, అధికార పార్టీకి తొత్తులుగా మారి బాధితులనే స్టేషన్ నుండి వెళ్ళగొట్టడం సిగ్గుచేటని ఆయన పేర్కొన్నారు. ఢిల్లీలో రాజ్యాంగ పుస్తకాన్ని చేతిలో పట్టుకొని ప్రజాస్వామ్యం గురించి ఉపన్యాసాలు ఇచ్చే రాహుల్ గాంధీ, తెలంగాణలో తన పార్టీ నాయకులు చేస్తున్న అరాచకాలను ఎందుకు ప్రశ్నించడం లేదని గౌతమ్ రావు నిలదీశారు. దేశంలో కేవలం మూడు రాష్ట్రాల్లో మాత్రమే అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, తెలంగాణలో మాత్రం విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతూ, కమిషన్ల కక్కుర్తితో పాలన సాగిస్తోందని ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దిగజార్చారని, ఉద్యోగులకు జీతాలు, వృద్ధులకు పెన్షన్లు ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం ఉందని విమర్శించారు. కేవలం రెండు సంవత్సరాల పాలనలోనే ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్నారని, స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు, నాయకులు జిల్లా ఇన్చార్జి బద్దం మహిపాల్ రెడ్డి , దేవకీ వాసుదేవరావు, తాండ్ర వినోద్ రావు, కె శ్రీధర్ రెడ్డి, నున్నా రవి కుమార్,తొండెపు సైదేశ్వర రావు , నెల్లూరి బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలందరూ నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** భద్రాద్రి జిల్లాలో తొలి విడతలో జరగబోయే పంచాయితీ ఎన్నికలకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లను చేసినట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొత్తం 320 పోలింగ్ స్థానాలలోని 1510 పోలింగ్ కేంద్రాలలో పోలీస్ శాఖ తరపున పూర్తిస్థాయి బందోబస్తును ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. సుమారుగా 1700 మంది పోలీసులతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా చర్యలను చేపట్టడం జరుగుతుందని అన్నారు. 1510 పోలింగ్ కేంద్రాలలో సాధారణ పోలింగ్ కేంద్రాలు 723, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు 157, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు 24, క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు 16, మావోయిస్టు ప్రభావిత పోలింగ్ కేంద్రాలు 590లను గుర్తించినట్లు తెలిపారు. ప్రజలందరూ నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు పోలీస్ అధికారులు సిబ్బంది ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని ఆదేశాలు జారీ చేశారు.




ఓటర్లను ప్రలోభ పెట్టే విధంగా ఎవరైనా నగదు మద్యం వంటి వాటితో పట్టుబడితే చట్టపరంగా కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఎస్పి తెలిపారు.





## చాకచక్యంగా ప్రచారం నిర్వహిస్తున్న సిపిఐ(ఎం) అభ్యర్థి రామచంద్రం

**ముదిగొండ, మహా:** మండలంలోని రెండో దశ జరగనున్న పంచాయతీ ఎన్నికల ప్రచారం పల్లెల్లో సర్పంచ్,వార్డు సభ్యుల అభ్యర్థులు విస్తృతంగా పర్యటించి,ఓటర్లను కలుసుకొని ఓటేయమని అభ్యర్థిస్తున్నారు.ప్రధానంగా కమలాపురం పంచాయతీలో బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన సిపిఐ(ఎం) అభ్యర్థి కుక్కల రామచంద్రం చాకచక్యంగా ప్రచారం నిర్వహిస్తూ ముందంజలో ఉన్నారు.సమయస్ఫూర్తిని ఉపయోగిస్తూ,నైపుణ్యతతో,తనదైన శైలిలో రామచంద్రం,వార్డు అభ్యర్థులతో గ్రామంలో పర్యటించి,జోరుగా ప్రచారం చేస్తున్నారు.ఓటర్లు ఓట్లు వేసి గెలిపిస్తే,గ్రామ అభివృద్ధి,ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని,ప్రజలకు అందుబాటులో ఉండి,ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని,ఓటర్లను కోరుతున్నారు.ప్రతి వార్డులో ఇంటింటికి తిరుగుతూ,తన గుర్తు,కత్తెర గుర్తుకు ఓటేయాలని అని,ఓటర్లకు అర్థవంతంగా చెప్తూ,బ్యాలెట్ పేపర్ను చూపిస్తూ,ఓటు వేసే విధానాన్ని రామచంద్రం ఓటర్లకు వివరిస్తున్నారు.అధికార కాంగ్రెస్ పార్టీల మోసపు మాటలు,అమలకు సాధ్యంగాని హామీలు,తమ పార్టీ ఇవ్వదని,గ్రామ అభివృద్ధిని కోరుకునే,విధంగా ప్రజలకు చేసే పనులే చెప్తామని, చెప్తామని,ఆచరణలో కూడా చేసి చూపిస్తామని రామచంద్రం ఓటర్లను కలుస్తూ ప్రభావితం చేస్తున్నారు.తను గ్రామ సర్పంచ్గా గెలిపిస్తే, గ్రామంలో ప్రగతి బాటలు వేస్తామని,ప్రజలకు కావలసిన మౌలిక,కనీస సౌకర్యాలను కల్పించి, రాజకీయాలకతీతంగా ప్రజలందరకు గ్రామ పాలను అందిస్తూ,పారదర్శకంగా అంకితభావంతో ప్రజల పక్షాన పని చేస్తామన్నారు.

## పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఉండాలి



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాలు, చెక్పోస్టులు, పంపిణీ కేంద్రాల్లో చేపట్టిన ఏర్పాట్లను జిల్లా సాధారణ పరిశీలకులు వి.సర్వేశ్వర రెడ్డి మంగళవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. ఎన్నికల విధానాలు సదుపాయాలు భద్రతా ఏర్పాట్లను సమీక్షించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. మొదటగా పరిశీలకులు బూర్గంపహాడ్ మండలంలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ను సందర్శించారు. పోలింగ్ సిబ్బందికి అవసరమైన ఎన్నికల సామగ్రి టోకెన్లు బ్యాలెట్ బాక్సులు ఇతర వనరుల పంపిణీపై అక్కడి అధికారులు ఇచ్చిన వివరాలను ఆయన పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్లో ఏర్పాట్లు సమయపాలనతో శాస్త్రీయంగా గందరగోళం లేకుండా చేపట్టాలని సూచించారు. మోరంపల్లి బంజార జడ్పీహెచ్ఎస్ పినపాకపట్టినగర్ జడ్పీహెచ్ఎస్ పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ పోలింగ్ కేంద్రాల్లో ఉన్న ప్రాథమిక సదుపాయాలైన తాగునీరు మరుగుదొడ్లు ర్యాంపులు లైటింగ్ సౌకర్యాలను పరిశీలించి ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా సౌకర్యాలు తప్పనిసరిగా కల్పించాలని సంబంధిత ఎన్నికల అధికారులను ఆయన ఆదేశించారు. ఈ పర్యటనలో సంబంధిత మండల అధికారులతో పాటు పోలీస్ విభాగం రెవెన్యూ అధికారులు ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## పట్టణంలో సోనియా గాంధీ జన్మదిన వేడుక

**దమ్మపేట, మహా :** పట్టణ కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ అద్యక్షురాలు సోనియాగాంధీ జన్మదిన వేడుకలు జరిపారు. పట్టణ కాంగ్రెస్ అద్యక్షుడు చిన్నశెట్టి చిట్టిబాబు ఆద్వర్యంలో కేక్ కట్ చేసి ,మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి పగడాల రమాదేవి ,సీనియర్ కాంగ్రెస్ నాయకులు అత్తులూరి వెంకట రామారావు ,చిన్న శెట్టి చిన్నబాబు ,చిన్నశెట్టి యుగంధర్ ,గోపి ,వార్డు సబ్యులు తదితరులు పాల్గొన్నారు.



# పాత, కొత్త తేడా లేదు... అందరినీ కలుపుకుపోతాం

- రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో అన్ని డివిజన్లను గెలుచుకుంటాం
- పనిచేసే వారందరికీ పార్టీలో సముచిత స్థానం
- ఖమ్మం ప్రెస్ క్లబ్ 'మీట్ ది ప్రెస్'లో సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి

**ఖమ్మం, మహా:** పాత కొత్త అనేది ఏమీ లేదు. పార్టీలో ఉన్న వారందరినీ కలుపుకు పోతాం. సమన్వయంతో పని చేస్తాం. రాబోయే కాలంలో ఖమ్మం నగరంలో కాంగ్రెస్ పార్టీని మహోన్నత శక్తిగా తయారు చేస్తామని సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి పేర్కొన్నారు. ఖమ్మం ప్రెస్ క్లబ్– టీయూడబ్ల్యూజే (ఐజేయు) ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన ' మీట్ ద ప్రెస్ ' కార్యక్రమంలో దీపక్ చౌదరి పలువురు జర్నలిస్టులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు.




**రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపుకు మీ వ్యూహం ఏమిటి..?**

కాంగ్రెస్ నాయకులందరినీ కలుపుకుపోయి సమన్వయంతో పని చేస్తా. ఇప్పటికే నేను సిటీ అధ్యక్షులుగా నియమితులైన దగ్గర నుండి నగరంలో పాతతరం కాంగ్రెస్ కార్యకర్తలను నాయకులను, కొత్తతరం నాయకులను అందరినీ కలుస్తూ పార్టీ ఎదుగుదల గురించి చర్చించడం జరిగింది. కార్యకర్తల సమస్యలను అడిగి తెలుసుకుంటున్నాను. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకుపోతాం.... రాపోయే కార్పొరేషన్ ఎన్నికల్లో 100% ఫలితాలను సాధిస్తాం.

**ఖమ్మం నగర పరిధిలో నామినేటెడ్ పోస్టుల భర్తీ కి చర్యలు..?**

ఇది నా పరిధిలోనిది కాదు అయినా పార్టీ దృష్టికి ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తాను.

**నగరంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది ఎలా అధిగమిస్తారు..?**

ఇది కూడా నా పరిధిలోనిది కాదు పెరుగుతున్న జనాభా నేపథ్యంలో ట్రాఫిక్ సమస్య కూడా పెరుగుతోంది. ఈ సమస్యను కూడా ఇటు అధికారులు అటు మంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తా.

**ఇందిరమ్మ ఇండ్లకు డబ్బులు వసూలు చేశారని విమర్శలు ఉన్నాయి..? ఇంకా కొంతమంది అర్హులకు ఇండ్లు రాలేదు. దీనిపై మీ కామెంట్..?**

ఇందిరమ్మ ఇండ్లకు డబ్బులు వసూలు చేశారనేది అవాస్తవం. విడతలవారీగా అందరికీ ఇందిరమ్మ ఇండ్లు వస్తాయి. ఇది ఒక విడతతో ఆగే పథకం కాదు. ప్రభుత్వం ఇండ్లు లేని నిరుపేదలందరికీ ఇండ్లు ఇవ్వాలనేది గొప్ప సంకల్పంతో పని చేస్తోంది. కావున అర్హులైన పేదలందరికీ ఇండ్లు వస్తాయి. ఆందోళన చెందవద్దు.

**ఖమ్మం నగరంలోని దేవాలయ కమిటీలలో అధికార పార్టీ నాయకులకే నామినేటెడ్ పదవులు ఇస్తారా..? లేదా అనాదిగా దేవాల యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వారికి ప్రాముఖ్యతను ఇస్తారా..?**

ప్రభుత్వం నామినేటెడ్ పదవులకు కసరత్తు చేస్తోంది.. ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. తప్పకుండా పని చేసే వారికి న్యాయం జరుగుతుంది.

**నగర కమిటీ పూర్తిస్థాయి నియామకం ఎప్పుడూ ఉంటుంది..?**

నేనింకా ప్రమాణ స్వీకారమే చేయలేదు. అధ్యక్షుడిగా నియమితులైన తర్వాత పంచాయతీ ఎన్నికలు వచ్చాయి. రఘునాథపాలెం మండలంలో ప్రచారం చేస్తున్నాను... త్వరలోనే పూర్తిస్థాయి కమిటీ ఏర్పాటు చేయడం జరుగుతుంది.

**నగర అభివృద్ధిపై మీ అభిప్రాయం. వచ్చే ఎన్నికల్లో ఎన్ని డివిజన్లు గెలుస్తారు..?**

ఖమ్మం నగరంలో శరవేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఖమ్మం సర్వతోముఖాభివృద్ధి జరుగుతుంది. ఖమ్మానికి మణిహారం తీగల వంతెన, పర్యాటక ప్రాంతంగా ఖమ్మం ఖిల్లా రోప్ వే, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులు, మెడికల్ కాలేజ్ నూతన భవన నిర్మాణం పనులు జరుగుతున్నాయి. రాష్ట్రానికే ఆదర్శంగా దేశములో రెండోదిగా ఖమ్మం వ్యవసాయ మార్కెట్ పనులు నగరంలో ముమ్మరంగా కొనసాగుతున్నాయి. నగరంలో నిరంతర తాగునీటి సరఫరా కోసం పనులు జరుగుతున్నాయి. ఇంకా రోడ్ల విస్తరణ, డ్రైనేజీల నిర్మాణం, తదితర మౌలిక సదుపాయాల కల్పన జరుగుతోంది. దీంతో తప్పకుండా కార్పొరేషన్ ఎన్నికల్లో అన్ని డివిజన్లను గెలుచుకుంటాం.

**గత కార్పొరేషన్ ఎన్నికల ఫలితాల్లో కొంత గలాటా జరిగింది. ముందు గెలిచినట్టు ప్రకటించినప్పటికీ కొన్ని అవాంతరాల తదనంతరం ఓడిపోయినట్టు ప్రకటించారు. అందులో మీరు కూడా ఉన్నారు. దీనిపై మీ కామెంట్..?**

జరిగిపోయిన వాటి గురించి చర్చ అవసరంలేదు. మా ప్రభుత్వ హాయాంలో అత్యంత పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించడం జరుగుతుంది.

**మీ గురించి చెప్పండి..?**

నేను ఎన్.ఎస్.యు.ఐ విద్యార్థి సంఘంలో తొలుత చేరాను. నాదెండ్ల భాస్కరరావు పని చేస్తున్న సమయంలో పార్టీలో చేరాను. 2003 ఖమ్మం టౌన్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీగా, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా, రాష్ట్ర కాంగ్రెస్ కార్యదర్శిగా, 2016లో కార్పొరేటర్ గా ఎన్నికయ్యాను. 2019లో ఖమ్మం నగర వర్కింగ్ ప్రెసిడెంట్గా ఏఐసీసీ నియమించింది. 2025లో కార్పొరేషన్ ప్రెసిడెంట్ గా నియమితులయ్యాను. ముందుగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా అడిగాను. జిల్లాలో నెలకొన్న పరిస్థితుల కారణంగా నగర కాంగ్రెస్ అధ్యక్షుడిగా అవకాశం ఇచ్చారు. ఏ పదవి అనేది ముఖ్యం కాదు. అప్పగించిన పనిని సమర్థవంతంగా నిర్వర్తిస్తే తప్పకుండా పార్టీ గుర్తిస్తుంది. ఈ మీట్ ద ప్రెస్ కార్యక్రమంలో టియుడబ్ల్యుజె (ఐజేయూ) జిల్లా అధ్యక్షకార్యదర్శులు ఏనుగు వెంకటేశ్వరరావు, మైసా పాపారావు, జాతీయ కౌన్సిల్ సభ్యులు నలజాల వెంకట్రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాటేటి వేణుగోపాల్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సామినేని మురారి, హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు కనకం సైదులు, ఎలక్ట్రానిక్ మీడియా కార్యదర్శి మహేందర్, యూనియన్ జిల్లా కోశాధికారి శివానంద, జిల్లా ఉపాధ్యక్షుడు పి.సత్యనారాయణ, యూనియన్ నగర అధ్యక్ష కార్యదర్శులు చెరుకుపల్లి శ్రీనివాస్, ఎన్ జనార్ధనాచారి, కోశాధికారి ఏలూరి వేణు, ప్రెస్ క్లబ్ కోశాధికారి కళ్యాణ్ చక్రవర్తి, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

## మన ఇసుక - మన వాహనం ర్యాంప్ ప్రారంభం



**బూర్గంపపహాడ్ మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండల కేంద్రంలో మన ఇసుక మన వాహనం మంగళవారం ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానిక తహసిల్దార్, ఎస్సై మేడ ప్రసాద్ లు పాల్గొని రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభోత్సవం చేశారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ ప్రసాద్ మాట్లాడుతూ..ఇసుక కావాల్సిన వారు తమ మొబైల్ ద్వారా మీ సేవలో కానీ, ఇసుక వాహనం యాప్‌లో పేరు నమోదు చేసుకొని ఎన్ని క్యూబిక్ మీటర్ల ఇసుక కావాలో నమోదు చేసుకుంటే బూర్గంపహాడ్ మండల కేంద్రంలోని కిన్నెరసాని రీచ్ నుంచి నాణ్యమైన ఇసుక ఇంటి వద్దకు చేరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మేడ ప్రసాద్ మాట్లాడుతూ...కొంత మంది దళారులు బ్లాక్ మార్కెట్ ద్వారా అధిక ధరకు ఇసుకను అమ్మి ప్రజలను ఆర్థికంగా కొల్లగొడుతున్నట్లు తమదృష్టికి వస్తే అలాంటి వారితో పాటు ఇసుకను కొంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్.ఐ. హెచ్చరించారు. ఇసుక రీచ్‌లను మైనింగ్ శాఖచే గుర్తించామని, మన ఇసుక వాహనం ద్వారా ప్రజలు ఇసుకను కొనుగోలు చేసి ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు మన ఇసుక మన వాహనం ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్ లు, స్థానిక ప్రజలు రెవెన్యూ సిబ్బంది, మైనింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## పోస్టల్ బీమా పథకాలను సద్వినియోగం చేసుకోండి



**ఖమ్మం, మహా:** తక్కువ ప్రీమియంతో ఎక్కువ బీమా పొందే పోస్టల్ ఇన్సూరెన్స్ పథకాలను సద్విని యోగం చేసుకోవాలని ఖమ్మం పోస్టల్ డిపార్ట్మెంట్ సూపరిం టెండెంట్ వీరభద్రస్వామి పేర్కొన్నా రు. ఖమ్మం ప్రెస్ క్లబ్ కార్యాలయంలో టీయూడబ్ల్యూజే (ఐజేయు) ఖమ్మం ప్రెస్ క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో నామా పురుషోత్తం అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన పోస్టల్ అవగాహన సదస్సులో వీరభద్రస్వామి మాట్లాడారు. తపాలా శాఖలో అమలవుతున్న సేవింగ్, ఇన్సూరెన్స్ పథకాలను వివరించారు. తక్కువ ప్రీమియంతో ఎక్కువ బీమాను పొందే అవకాశం తపాలా శాఖలో ఉందన్నారు. ఇక్కడ అమలవుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పథకాల ద్వారా కుటుంబానికి ఆర్థిక భద్రత ఉంటుందని అన్నారు. తపాలాశాఖ నుండి సేవింగ్స్, బ్యాంక్ అకౌంట్, రికరింగ్ డిపాజిట్ అకౌంట్, సుకన్య సమృద్ధి అకౌంట్ పథకాలు అమలవుతున్నాయన్నారు.

## జిల్లాలో 2.20 లక్షల ఎకరాలు



**"నేలకొండపల్లి, మహా:** జిల్లాలో 2.20 లక్షల ఎకరాలు మొక్కజొన్న సాగు కు రైతులు ప్రణాళికలు తయారు చేసుకుంటున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య తెలిపారు. మండలం లోని ముజ్జుగూడెం లో మొక్కజొన్న సాగు ను పరిశీలించారు. బోదులబండ లో డ్రమ్ సీడర్ సాగు ను పరిశీలించారు. అనంతరం రైతులకు సొసైటీ తయారు చేసిన రైతు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు... జిల్లాలో మొక్కజొన్న సాగు లో రైతులు బిజీగా ఉన్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 3.5 లక్షల ఎకరాల వరి సాగు చేసినట్లు తెలిపారు. అందులో ఇప్పటి వరకు 2.30 లక్షల ఎకరాలు కోతలు కోసినట్లు తెలిపారు. జనవరి మొదటి వారం "లోపు పూర్తిగా వరి కోతలు పూర్తి కానున్నట్లు తెలిపారు. యాసంగి తో దాదాపు 3 లక్షల ఎకరాలు వరి సాగు చేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. జిల్లా లో రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని... రైతులు ఆందోళన చెందనవసరం లేదన్నారు. యూరియా పంపిణీ కోసం సొసైటీ లు రైతులకు యూరియా వినియోగ పుస్తకాలను అందించనున్నట్లు తెలిపారు. దీని వలన పంపిణీ పారదర్శకంగా ఉంటుందని తెలిపారు. మొక్కజొన్న లో కత్తెర పురుగు వస్తుందని రైతులు నివారణ చర్యలు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మండల, వ్యవసాయాధికారి యం.రాధ, ఏఈవో లు, సొసైటీ సీఈవోలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.




# సోషల్ మీడియా వేదికగా పోటాపోటీ ప్రచారం

**నెలకొండపల్లి, మహా:** పంచాయతీ ఎన్నికలు గ్రామాల్లో హీటెక్కిస్తున్నాయి. పోటీ చేస్తున్న అభ్యర్థులు గతానికి భిన్నంగా సోషల్ మీడియాను వినియోగించుకుంటున్నారు. ప్రతి గ్రామంలో వార్డు మెంబర్‌గా పోటీ చేస్తున్నవారు.. సర్పంచ్‌గా బరిలో నిలిచినవారు సోషల్ మీడియా వేదికగాను ప్రచారం చేస్తున్నారు. గ్రామానికి చెందిన వారు ఇతర ప్రాంతాల్లో ఉంటే వారికి సమాచారం చేరవేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. గెలిపిస్తే ఏం చేస్తాం.. అభివృద్ధి పనులు ఇతరాత్రాలను సైతం పోస్టులు పెడుతున్నారు. ఏ వార్డుకు పోటీ చేస్తున్నామనే విషయాన్ని సైతం స్పష్టంగా చెబుతున్నారు. అంతేకాదు ఏ గుర్తు కేటాయించిందనే అంశాలను సైతం ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రాం.. టెలిగ్రాం ఇలా అన్నింటిలోనూ ప్రచారం చేస్తూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు. రాష్ట్రంలో తొలి విడుత, రెండో విడుత బరిలో ఉండే అభ్యర్థుల ప్రకటన జరిగింది. వారికి అధికారులు గుర్తులు సైతం కేటాయించారు. ఈ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు పార్టీ గుర్తులతో జరుగక పోయినప్పటికీ ఆయా పార్టీల మద్దతుతోనే అభ్యర్థులు బరిలో నిలిచారు. అయితే గ్రామాల్లో ఎక్కువగా అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ మధ్యే పోటీ తీవ్రంగా నెలకొంది. కొన్ని గ్రామాల్లో కొందరు పార్టీల మద్దతు ఇవ్వకపోవడంతో స్వతంత్రంగా బరిలో నిలిచారు. వారికి సైతం గుర్తులు వచ్చాయి. అయితే ఎన్నికల ప్రచారం స్పీడ్ అందుకుంది. తొలి విడుత ఈ నెల 11న, రెండో విడుత 14న ఎన్నికలు జరుగనున్నాయి. దీంతో అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. అయితే వార్డుల వారీగా ఓటర్ల లిస్టు ప్రకారం వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి గెలిపిస్తే చేయబోయే అంశాలను అందులో పోస్టు చేస్తున్నారు. తనకు ఫలానా గుర్తు కేటాయించారని.. ఆ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. దీనికి తోడు సోషల్ మీడియాలో ఫొటోలు, కేటాయించిన గుర్తులను పోస్టు చేసి విస్తృత ప్రచారం చేస్తున్నారు. దీంతో సోషల్ మీడియాలోనూ ప్రచారం ఊపందుకుంది. పోటీ చేసే అభ్యర్థులు ఇంటింటికెళ్లి గెలిపిస్తే ఏం చేస్తామనే విజన్‌ను వివరిస్తున్నారు. గ్రామాభివృద్ధి కోసం ఐదేళ్లలో చేయబోయే కార్యక్రమాల ప్రణాళికలు రెడీ చేశామని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. 'గెలిపిస్తే డ్రైనేజీ సమస్య పరిష్కరిస్తా.. కోతులు గ్రామానికి రాకుండా చేస్తా.. ఊరిలో సీసీ కెమెరాలు పెట్టిస్తా.. గ్రంథాలయం ఏర్పాటు చేస్తా.. మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయిస్తా.. ఒకడుగు ముందుకేసి నిరుద్యోగుల కోసం ఉద్యోగ మేళా, హెల్త్ క్యాంపులు పెట్టిస్తామని.. సీసీరోడ్లు, క్రీడా పరికరాలు' ఇలా హామీలిస్తూ ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం మొదలు పెట్టారు. చీరలు, కుంకుమ భరణిలు, వైన్స్, నగదు ఇతర కానుకలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు సమాచారం. అన్న, తమ్ముడు, అక్కాచెల్లి, అత్త, మామ, బాబాయ్?, పిన్ని ఇలా వరుసలు కలుపుతూ పలకరిస్తూ సెంటిమెంట్‌ను ఒక్కసారి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. గతంలో పలుకరించని వారు సైతం పలుకరిస్తూ మరీ ఓట్లను అభ్యర్థిస్తున్నారు. ఇంటింటికీ అభ్యర్థులు అనుచరులతో తిరుగుతూ చేసే పనులను సైతం వివరిస్తున్నారు. మద్దతు దారుల గెలుపు కోసం వ్యూహాలు సర్పంచ్ ఎన్నికల ప్రచారానికి సమయం దగ్గర పడుతుండటంతో ప్రధాన పార్టీల నేతలు గ్రామాలకు చేరుతున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ తమ మద్దతు దారులను గెలిపించుకునేందుకు స్పెషల్ ఫోకస్ పెట్టాయి. పార్టీలకు సంబంధం లేకుండా జరిగే ఎన్నికలే అయినా.. తమ వాళ్లే గెలవాలనే పట్టుదలతో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు నియోజకవర్గ ఇన్-ఛార్జులు, తదితర నాయకులు గ్రామాల బాట పట్టారు. సొంత గ్రామాలపై మరింత ఫోకస్ పెట్టారు. పంచాయతీల్లో పట్టు సాధించి, రానున్న ఎన్నికలకు గట్టి పునాది వేసేలా ముందుకెళ్తున్నారు. తమ సత్తా చాటేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. తమ మద్దతు దారులు గెలిచేందుకు వ్యూహాలు రచిస్తున్నారు. ఎదుటి వ్యక్తిలోని లోపాలను తెలుసుకొని ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు. ఇది ఇలా ఉంటే గ్రామాల్లో మాత్రం సోషల్ మీడియాలో మాత్రం పంచాయతీ ఎన్నికల ప్రచారానికి అభ్యర్థులు వేదికగా చేసుకుంటున్నారు. విస్తృత ప్రచారం చేసుకుంటున్నారు. ఓటర్లను ఆకర్షించేందుకు వీడియోలు సైతం పోస్టు చేస్తున్నారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జెడ్పి సీఈవో

**కారేపల్లి, మహా :** గ్రామపంచాయతీ సాధారణ ఎన్నికల్లో భాగంగా కారేపల్లి మండల కేంద్రంలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసీవింగ్ సెంటర్ లను, జూనియర్ కాలేజ్ ప్రాంగణాన్ని జిల్లా పరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దీక్ష రైనా మంగళవారం సందర్శించారు. ఈ నెల 17వ తేదీన జరగనున్న పంచాయితీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లను పరిశీలించి, ప్రశాంతంగా జరగడానికి అధికారులకు, సిబ్బందికి తగిన సలహాలు, సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక వసతులు మౌలిక వసతులు కల్పించడంతోపాటు ఇతర ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం లోఎమ్మార్వో అనంతుల రమేష్, ఎంపీడీవో పొన్నూరి శ్రీనివాసరావు, ఎంపీ ఓ మల్లెల రవీంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





## అశ్వారావుపేటలో ఎన్నికల నియమావళి అవగాహన

**అశ్వారావుపేట, మహా:** అశ్వారావుపేట ఎంపీడీవో కార్యాలయంలో ఎన్నికల నియమావళిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాల్వంచ డీఎస్పీ ఆర్ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచ్, వార్డు మెంబర్ అభ్యర్థులు మరియు మండల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల వ్యయ పరిశీలకుడు మాట్లాడుతూ, అభ్యర్థులందరూ ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా అనుసరిస్తూ మాత్రమే ఖర్చులు చేయాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన పక్షంలో సంబంధిత చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అశ్వారావుపేట మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు పూర్తయ్యేలా భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ రోజు పాటించవలసిన ఎన్నికల నియమాలు, ప్రజలు శాంతిని కాపాడే విధంగా పాటించాల్సిన సూచనలు వివరించారు. ప్రతి అభ్యర్థి మరియు ప్రతి ఓటరు అవగాహనతో సహకరిస్తే ఎన్నికలు విజయవంతంగా పూర్తవుతాయని పేర్కొన్నారు.

## అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ




**మణుగూరు, మహా :** సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని గనుల్లో, వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులు పనిస్థలాల్లో క్షణక్షణం అప్రమత్తంగా ఉంటేనే ప్రమాదాలను పూర్తిగా అరికట్టవచ్చని రక్షణ తనిఖీ బృందం కన్వీనర్, జీఎం(ఈ అండ్ ఎం) ఎన్ దామోదర్‌రావు అన్నారు. సింగరేణి 56వ రక్షణ పక్షోత్సవాల సందర్భంగా మంగళవారం ఏరియా వర్క్‌షాపులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మానవ తప్పిదాలే ప్రమాదాలకు ప్రధాన కారణమని, ముఖ్యంగా విధి నిర్వహణ సమయంలో సెల్‌ఫోన్ వాడకం ప్రమాదాలకు దారితీస్తుందని తెలిపారు. అత్యవసరమైతే తప్ప విధుల్లో మొబైల్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలన్నారు. భద్రతపై ఒక్క క్షణం కూడా నిర్లక్ష్యం చోటుచేసుకున్నా ప్రమాదాలకు ఆస్కారం ఉంటుందని హెచ్చరించారు. అనంతరం ఏరియా జీఎం దుర్గం రామచందర్ మాట్లాడుతూ.. భద్రత అంటే కేవలం నిబంధనలు పాటించడం మాత్రమే కాదని, అది ప్రతి ఉద్యోగి మనోభావంగా మారాలని సూచించారు.

## అశ్వారావుపేట దోంతికుంట చెరువులో సర్వే ప్రారంభం



**అశ్వారావుపేట, మహా :** అశ్వారావుపేట మండల పర్యటన సందర్భంగా ఆదాయ శాఖ మంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి ఇచ్చిన సూచనల మేరకు దోంతికుంట చెరువులో సర్వే పనులు అధికారికంగా ప్రారంభమయ్యాయి. అశ్వారావుపేట పరిధిలోని దోంతికుంట చెరువులో అధికారులు సర్వే ప్రాథమిక కార్యక్రమాన్ని ప్రారంభించారు. చెరువు మొత్తం విస్తీర్ణం, సరిహద్దులు, చెరువు చుట్టుపక్కల ఉన్న భూముల స్థితిగతులు, అక్రమ ఆక్రమణలకు సంబంధించిన సమాచారం సేకరిస్తూ సర్వే కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. చెరువు పునరుద్ధరణ, నీటి నిల్వ సామర్థ్య పెంపు, భవిష్యత్ అభివృద్ధి పనులకు ఈ సర్వే కీలకంగా ఉండనుందని పేర్కొన్నారు. మంత్రుల ఆదేశాల ప్రకారం చెరువు పరిరక్షణకు దిశానిర్దేశితంగా చర్యలు తీసుకోవడం ప్రారంభమైందని, సర్వే నివేదిక సిద్ధమైన తరువాత తదుపరి పనులు వేగంగా పురోగమిస్తాయని అధికారులు వివరించారు.

# తొలి విడత పోరుకు సర్వం సిద్ధం




**ఖమ్మం బ్యూరో, మహా:** ఖమ్మం జిల్లాలో ప్రతిష్టాత్మకంగా జరగనున్న పంచాయతీ ఎన్నికల మొదటి విడత నిర్వహణకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. జిల్లాలోని ఏడు మండలాల పరిధిలో డిసెంబర్ 11న జరగనున్న పోలింగ్ ప్రక్రియ కోసం పటిష్టమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలను జిల్లా యంత్రాంగం చేపట్టింది. ఈ మొదటి విడతలో మొత్తం 192 గ్రామ పంచాయతీలకు గాను 20 పంచాయతీలు ఏకగ్రీవం కాగా, మిగిలిన 172 గ్రామ పంచాయతీల సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ స్థానాల కోసం మొత్తం 488 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. అలాగే 1740 వార్డులకు సంబంధించి 2 వార్డులలో నామినేషన్లు దాఖలు కాలేదని, 323 వార్డులు ఏకగ్రీవం అయ్యాయని కలెక్టర్ తెలిపారు. మిగిలిన 1415 వార్డుల కోసం 3424 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ రోజునే ఫలితాలు కూడా వెల్లడికానున్నాయి. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరుగుతుందని, అనంతరం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టి ఫలితాలు ప్రకటిస్తామని అధికారులు స్పష్టం చేశారు. ఈ విడతలో మొత్తం 2,41,137 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో విశేషమేమిటంటే పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. 1,16,384 మంది పురుష ఓటర్లు ఉండగా, 1,24,743 మంది మహిళా ఓటర్లు, 10 మంది ఇతర ఓటర్లు ఉన్నారని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఎన్నికల నిర్వహణ కోసం జిల్లా వ్యాప్తంగా 2089 బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేయడంతో పాటు, విధుల్లో 1899 మంది పోలింగ్ అధికారులు, 2321 మంది ఇతర పోలింగ్ సిబ్బందిని నియమించారు. సామాగ్రి పంపిణీ మరియు సేకరణ కోసం 7 డిస్ట్రిబ్యూషన్, 7 రిసెప్షన్ కేంద్రాలను కూడా ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భద్రతాపరంగా కఠిన చర్యలు తీసుకున్నారు. జిల్లాలో 36 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ లొకేషన్లను గుర్తించి, 360 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ ద్వారా నిరంతర పర్యవేక్షణ ఏర్పాటు చేశారు. అదనంగా 162 సున్నితమైన (సెన్సిటివ్) కేంద్రాలలో మైక్రో అబ్జర్వర్లను నియమించి పరిస్థితిని సమీక్షించనున్నారు. ఎన్నికలు స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా జరిగేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు, ప్రజలు తమ సంపూర్ణ సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి విజ్ఞప్తి చేశారు.

## ఎన్నికల విధుల కేటాయింపులో లోపించిన పారదర్శకత



**కారేపల్లి, మహా:** స్థానిక సంస్థలకు సంబంధించి ఎన్నికల విధుల కేటాయింపులో పారదర్శకత లోపించిందని కొందరికి మూడువిడతలలో డ్యూటీలు మరికొందరికి అసలు డ్యూటీ లే వేయలేదని టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి డిఎస్. నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు.మండల అధ్యక్షులు బి.రాంచందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి డిఎస్. నాగేశ్వరరావు మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల డ్యూటీల కేటాయింపుల్లో చిత్రవిచిత్రాలు చోటు చేసుకున్నాయన్నారు. ఇష్టారాజ్యంగా అధికారులు డ్యూటీలు వేశారని, కొందరికి రెండువిడతలు మరికొందరికి మూడు విడతల డ్యూటీలు వేశారన్నారు. అలాగే మరికొందరికి అసలు డ్యూటీ లే కేటాయించలేదన్నారు.అసలు డ్యూటీలు కేటాయించకపోవడంలో ఆంతర్యం ఏమిటో అర్థం కావటం లేదని వారు వాపోయారు.అధికారులు ఇష్టారీతిన డ్యూటీలు కేటాయించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.మూడు విడతల డ్యూటీలు పడ్డవారికి ఒక విడత డ్యూటీ రద్దుచేసి, అసలు డ్యూటీ పడని వారికి, ఒక విడత డ్యూటీ పడ్డవారికి కేటాయించాలన్నారు. ఎన్నికలు పూర్తిచేసుకుని సుదూర ప్రాంతాల నుండి అర్ధరాత్రి తర్వాత స్వస్థలాలకు చేరుకునే అవకాశం ఉన్నందున పోలింగ్ మరుసటి రోజు ఓ.డి (ఆన్ డ్యూటీ) సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బి.సింగ్యా, వి.రమేష్, కే.శ్యామల, ఏ. సుస్మిత,మూడ్ పుల్లయ్య, జె.పుల్లయ్య,శ్రీదేవి, శంకర్రావు, రాఘవరావు, యం.నాగేశ్వరరావు, శ్యాంకుమార్, నరసింహారావు, జె.నాగేశ్వరరావు, హరియా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కిష్టారం పంచాయతీలో రసవత్తర పోరు

- సర్పంచ్ పదవికి ఎన్నిక అనివార్యం
- ఏకగ్రీవానికి బ్రేక్.. సర్పంచ్ బరిలో నలుగురు అభ్యర్థులు
- 12 వార్డులు ఏకగ్రీవం



**సత్తుపల్లి, మహా:** మూడవ దశ పంచాయతీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా సత్తుపల్లి మండలం కిష్టారం పంచాయతీలో రాజకీయ వాతావరణం రాజుకుంది. మంగళవారం జరిగిన నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం ఆసక్తికర మలుపులు తిరిగింది. గ్రామాభివృద్ధిని కాంక్షిస్తూ సర్పంచ్ పదవిని ఏకగ్రీవం చేసేందుకు గ్రామ పెద్దలు తీవ్ర ప్రయత్నాలు చేసినప్పటికీ, స్వతంత్రుల అభ్యంతరంతో అవి ఫలించలేదు. దీంతో ఎన్నికల సమరానికి రంగం సిద్ధమైంది.కిష్టారం సర్పంచ్ పీఠం కోసం ప్రధాన పార్టీల మధ్య చతుర్ముఖ పోటీ నెలకొంది. అధికార కాంగ్రెస్ పార్టీ తరపున నరుకుళ్ళ రాజేశ్వరి బరిలో నిలవగా, బి.ఆర్.ఎస్ పార్టీ తరపున మోరంపూడి కృష్ణ పోటీ చేస్తున్నారు. అలాగే తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా చల్లగళ్ళ అప్పారావు, బి.జె.పి తరపున పత్తిపాటి మధు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. మరోవైపు సర్పంచ్ పదవికి ఎన్నిక జరుగుతుండగా, వార్డు సభ్యుల ఎన్నిక మాత్రం పూర్తి ఏకగ్రీవంగా ముగియడం విశేషం. గ్రామంలోని మొత్తం 12 వార్డులకు గాను అన్నింటినీ ఏకగ్రీవం చేశారు. ఇందులో అధికార కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు 7 వార్డులను కైవసం చేసుకోగా, బి.ఆర్.ఎస్ పార్టీ మద్దతుదారులు 5 వార్డులను దక్కించుకున్నారు. వారి వివరాలు: 1వ వార్డ్ చిట్టిమాల.రాణి (బి.ఆర్.ఎస్),2వ వార్డ్ చిట్టిమాల.ప్రమీల(కాంగ్రెస్),3వ వార్డ్ బాణాల.రవీంద్రబాబు చారి (బి.ఆర్.ఎస్),4వ వార్డ్ పత్తిపాటి.అశోక్(కాంగ్రెస్),5వ వార్డ్ పత్తిపాటి.మరియమ్మ(బి. ఆర్.ఎస్),6వ వార్డ్ ఓడి.భవాని (కాంగ్రెస్),7వ వార్డ్ శీలం.నాగరాణి(కాంగ్రెస్),8వ వార్డ్ జువ్వాల.శ్రీనివాసరావు (కాంగ్రెస్),9వ వార్డ్ సురటి. వెంకటరమణ (కాంగ్రెస్),10 వ వార్డ్ కండె.బాలమ్మ (బి.ఆర్.ఎస్), 11వ వార్డ్ పాలకుర్తి.సునీల్ శ్రీకాంత్ (కాంగ్రెస్),12వ వార్డ్ పాలకుర్తి. రాజు (బి.ఆర్.ఎస్). సర్పంచ్ స్థానానికి ఎన్నిక అనివార్యం కావడంతో అభ్యర్థులు తమ ప్రచార ఉధృతిని పెంచేందుకు సిద్ధమవుతున్నారు.





# ముగిసిన నామినేషన్ల పరిశీలన

## ఆరుగురు సర్పంచులు ఏకగ్రీవం!

**కారేపల్లి, మహా:** మూడవ విడత స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల పరిశీలన సింగరేణి మండలం లో మంగళవారం ముగిసాయి. మండలంలో 41 గ్రామపంచాయతీలకు ఈ నెల 17వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. కొత్త తండా టేకులగూడెం బోటి తండా కొత్త కమలాపురం వెంకిట్యా తండా గిద్దవారిగూడెం పంచాయతీల సర్పంచులు ఏకగ్రీవం అయ్యాయి. ఈ పంచాయతీలకు సంబంధించి అధికారి కంగా ధ్రువీకరిం చాల్సి ఉంటుంది. గిద్దవారిగూడెం సర్పంచ్‌గా ఈశాల వెంకటేశ్వర్లు కొత్త తండా గ్రామపంచాయతీ సర్పంచిగా ధారావత్ మంగీలాల్ టేకులగూడెం గుమ్మడి సందీప్ వెంకిట్యా తండా బానోతు బుల్లి కొత్త కమలాపురం సర్పంచ్ గా రాథోడ్ సులోచన బోటి తండా భూక్య తులిశ్యా ఏకగ్రీవం కానున్నారు. అయితే అధికారులు సర్పంచులకు సంబంధించిన వివరాలను జిల్లా కలెక్టర్ కు పంపగా అక్కడ ధ్రువీకరించాల్సి ఉంది. 257 నామినేషన్లు 356 వార్డ్ మెంబర్లకు860 నామినేషన్ పత్రాలు అభ్యర్థులు అందజేశారు. మండలంలో 41 గ్రామపంచాయతీలకు సంబంధించి 13 కేంద్రాల ద్వారా నామినేషన్ కేంద్రాల వద్ద అభ్యర్థులు ఇబ్బందులు పడకుండా హెల్ప్ డెస్కును ఏర్పాటు చేశారు.

# తొలి విడత పోలింగ్‌కు కేవలం రెండు రోజులే

**నేలకొండపల్లి, మహా :** పంచాయతీ ఎన్నికలు రసవత్తర స్థాయికి చేరుకున్నాయి. రెండో విడత పోలింగ్‌కు ఈనెల 14 వ తేది కావడంతో కేవలం మూడు రోజులు రోజుల గడువే ఉంది. దీంతో ప్రచారం తోపాటు ప్రలోభాలు ఊపందుకున్నాయి. మందు.. విందుతో ఓటర్లను ఖుషీ చేస్తున్నారు. నేలకొండపల్లి మండల పరిధిలోని పలు గ్రామాల్లో పోలింగ్ జరగనుంది. ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు ప్రధాన పార్టీలు పావులు కదుపుతున్నాయి. చాలా చోట్ల అధికార కాంగ్రెస్.. ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ మద్దతుదారుల మధ్య పోటీ కనిపిస్తుండగా అక్కడక్కడ బీజేపీ మద్దతుదారుల.., స్వతంత్ర అభ్యర్థులు పోటీలో కనిపిస్తున్నారు. ఎలాగైనా సరే.. ఎంత ఖర్చయినా సరే అనే రీతిలో ముందుకు సాగుతున్నారు. డబ్బులు లేకున్నా మిత్రులు, బంధువుల వద్ద తీసుకోవడమో.. లేదా అప్పు చేసేందుకు సైతం వెనుకాడటం లేదు. ఆరున్నరేళ్ల తర్వాత జరుగుతున్న ఎన్నికలు కావడంతో ఎలాగైనా విజయం సాధించాలనే పట్టుదలతో ఉన్నారు. ఈ ఎన్నికలు పార్టీ రహితంగా జరుగుతున్నా ప్రతి అభ్యర్థి ఏదో ఒక పార్టీకి అనుబంధంగానే బరిలోకి దిగుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీదారుల ప్రవర్తన, సేవాభావం, అందుబాటులో ఉండేవారినే ఓటర్లు ఆదరిస్తారు. అయినా ప్రలోభాలు కొనసాగుతున్నాయి. అలాగే కొన్ని గ్రామాలలో బహిరంగంగానే మద్యం, మందు పంపిణీ చేస్తూ డబ్బులతో ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారని సమాచారం. దీంతో గ్రామాల్లో పోలీసుల నిఘా కనిపించడం లేదని ప్రజలు అంటున్నారు. పంచాయతీ ఎన్నికలు చివరి దశకు చేరుకున్నాయి. మూడు దశలకు సంబంధించిన నామినేషన్ల పర్వం ముగిసింది. నేటితో చివరి విడత నామినేషన్ల ఉపసంహరణ ముగియనుంది. పోటీ తీవ్రంగా ఉన్న గ్రామాల్లో వారం పది రోజుల నుంచే మందు, విందుతో ముంచెత్తుతున్నారు. కులాలు, యువజన, మహిళా సంఘాల వారీగా మాట్లాడుకుని డబ్బులు పంచుతున్నారు. మొదటి విడత పోలింగ్‌కు రెండు రోజుల ముందు డబ్బు, మద్యం పంచేందుకు అభ్యర్థులు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నట్లు సమాచారం.. అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. నిత్యం




మందు, విందుతో దావత్‌లు చేస్తున్నారు. కొంత మంది ఏకంగా కిచెన్లు ఏర్పాటు చేసి విందులిస్తున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా మధ్యాహ్నం నుంచే ఈ విందు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. దావత్‌లకు ఫాంహౌస్‌లు, వ్యవసాయ క్షేత్రాలు, పంట పొలాలు, రహస్య ప్రదేశాలను ఎంచుకుంటున్నారు. మద్దతు దారులు చేజారి పోకుండా జాగ్రత్త పడుతున్నారు. కొందరైతే ఓటుకు ఇంతని లెక్కలేసి పోలింగ్‌కు ఒకటి రెండు రోజులముందు డబ్బు పంపిణీకి ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు తెలుస్తోతోంది. కొన్ని గ్రామాల్లో ఇళ్లకు నేరుగా మద్యాన్ని చేరవేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుత ఎన్నికల్లో అభ్యర్థుల ఖర్చులను నిఘా విభాగం పెద్దగా పట్టించుకున్నట్లు కనిపిండం లేదు. ఇదే అదనుగా భావించిన అభ్యర్థులు ఇష్టారాజ్యంగా ఖర్చు చేస్తున్నట్లు సమాచారం. ఎన్నికల వ్యయా న్ని తగ్గించడానికి ప్రభుత్వం పరిశీలకులను నియమించినా పోటీదారులు ఖాతరు చేయడంలేదు. బహిరంగంగానే మద్యం, మందు పంపిణీ చేస్తూ డబ్బులతో ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారని తెలుస్తుంది. గ్రామాల్లో అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.